ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజ్ఞాన కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.
- ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దర్యాప్తు బృందం 'సిట్'ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యంగా, రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.
- ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు పంచాయతీలకు జాతీయ పంచాయతీ పురస్కారాలు లభించాయి.
- భారత రాజ్యాంగ నిర్మాత డా. బి. ఆర్. అంబేద్కర్ వర్ధంతిని పురష్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఆయనకు నివాళులు అర్పించారు.

==================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజ్ఞాన కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. విశాఖపట్నంలో ఈరోజు నిర్వహించిన డీప్‌టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో రాష్ట్ర యువత సమర్థులుగా మారుతున్నారని అన్నారు. డీప్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. రాష్ట్రానికి ఉన్న వనరుల్లో అధిక తీరప్రాంతం ఒకటని, పెట్టుబడులతో వస్తున్న వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్.. 29 సెకన్లు)

అంతకుముందు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా విశాఖలోని పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

==================

కేంద్ర ప్రభుత్వం అందించే 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్' అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి నాలుగు పంచాయతీలకు పురస్కారాలు లభించాయి. ఆరోగ్యకరమైన పంచాయితీల విభాగంలో చిత్తూరు జిల్లాలోని బొమ్మ సముద్రం, నీటి సరఫరా విభాగంలో అనకాపల్లి జిల్లాలోని న్యాయంపూడి గ్రామ పంచాయతీ, పచ్చదనం, పరిశుభ్రత విభాగంలో అనకాపల్లి జిల్లాలోని తగరంపూడి గ్రామ పంచాయతీ, సోషల్లీ జస్ట్ అండ్ సోషల్లీ సెక్యూర్డ్ పంచాయత్ విభాగంలో ఎన్టీఆర్ జిల్లాలోని ముప్పాళ్ళ పంచాయతీలు అవార్డులు పొందాయి. జాతీయ పురస్కారాలు పొందిన పంచాయతీలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. "రాష్ట్ర పంచాయతీలకు పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ఈ క్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పంచాయతీలు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయని అన్నారు.

==================

భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బాపట్ల జిల్లా, రేపల్లె మండలం పేటేరు గ్రామంలో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోదన్నారు. ఈ సదస్సుల ద్వారా ప్రజల దీర్ఘకాలిక భూ సమస్యలను పారదర్శకతతో, జవాబుదారీతనంతో పరిష్కరించేలా అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 రోజుల పాటు జరుగనున్న రెవెన్యూ సదస్సులో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకోవడానికి కూడా వెనకాడబోమని మంత్రి స్పష్టం చేస్తూ..

(వాయిస్.. 15 సెకన్లు)

==================

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఐటిడిఏ ప్రగతిపై మంత్రి ఈరోజు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల సంపూర్ణ ఎదుగుదలకు విద్య దోహదపడే విధంగా పాఠశాలల్లో చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రూపాల్లో విద్యాలయాల్లోకి మాదక ద్రవ్యాలు ప్రవేశించే పరిస్థితులు ఉన్నాయని వాటిపై పక్కాగా పర్యవేక్షణ చేయాలని అన్నారు. వసతి గృహాలు, పాఠశాలలను ఆకస్మికంగా

తనిఖీ చేయాలని ఆమె ఆదేశించారు. ప్రతి వసతి గృహానికి ఏఎన్ఎంను, బోధనేతర సిబ్బందిని త్వరలో నియమిస్తామని తెలిపారు.

===================

విరామం

===================

భారత రాజ్యాంగ నిర్మాత, డా.బిఆర్ అంబేద్కర్ సేవలను, ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి రఘురామ కృష్ణ రాజు అన్నారు. అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని ఈరోజు అసెంబ్లీ సమావేశ మందిరంలో ఉప సభాపతి రఘురామ కృష్ణ రాజు అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన దేశానికి ప్రపంచంలోనే ఒక గొప్ప రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేద్కర్ కే దక్కుతుందని పేర్కొన్నారు.

నాటి సమాజంలో ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేద్కర్ తన జీవిత కాలం చేసిన పోరాటం మరువలేనిదని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భముగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన మహానేత డాక్టరు బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు, త్యాగాలు భావితరాలకు తెలియజేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి కోరారు. భీమవరంలో అంబేద్కర్ విగ్రహానికి కలెక్టరు పూలమాలలు వేసి, ఘననివాళులు అర్పించారు.

===================

ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దర్యాప్తు బృందం 'సిట్'ను ఏర్పాటు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరుగురు సభ్యులతో కూడిన సిట్‌కు చీఫ్‌గా వినీత్ బ్రిజ్‌లాల్‌కు బాధ్యతలు అప్పగించారు. సిట్ సభ్యులుగా సీఐడీ ఎస్పీ ఉమామహేశ్వర్, డీఎస్పీలు అశోక్ వర్ధన్, గోవిందరావు, డీఎస్పీలు బాలసుందర్‌రావు, రత్తయ్యలను నియమించారు. ప్రతి 15 రోజులకొకసారి కేసు పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ప్రభుత్వం.. సిట్‌కు పూర్తి స్థాయి అధికారాలు అప్పగించింది.

===================

భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి తెలియజేసేందుకు దేశంలోని అనేక ప్రాంతాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యాటక, సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో విజయవాడలో 3 రోజుల పాటు జరిగే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ గోపీ మాట్లాడుతూ సంగీతాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

(వాయిస్.. 26 సెకన్లు)

===================

పార్వతీపురం మన్యం జిల్లాలోని కొండాపురంలో మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రెవెన్యూ సదస్సు ఈరోజు ప్రారంభించారు. "మీ భూమి మీ హక్కు" అనే నినాదంతో ఈరోజు నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూసమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించి భూ పట్టాదారు చట్టాన్ని రద్దు చేశారన్నారు. ప్రభుత్వ లోగోతో భూమి పట్టా పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. "డి" పట్టా సమస్యలు వివాదాలకు ప్రధానమైనవని, వీటిని పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధ వహించాలని ఆమె పేర్కొన్నారు. సదస్సులకు, కార్యాలయానికి వచ్చే రైతుల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఆమె కోరారు.

===================

రెవెన్యూ సదస్సుల ద్వారా 45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో రెవెన్యూ సదస్సులను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి, ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ-గవర్నెన్స్ విధానంలో వాట్సాప్ గవర్నస్ విధానాన్ని రూపొందిస్తున్నారని, వాట్సాప్ ద్వారానే తమకు కావాల్సిన ధృవపత్రాలను, ఇతర సేవలను పౌరులు పొందవచ్చునని మంత్రి తెలిపారు.

===================

===================